# హయగ్రీవోపనిషత్తు

– డా. కరి పురుషోత్తమాచార్యులు

**ఉపోద్ఘాతము :**

హయగ్రీవోపనిషత్తు అథర్వణవేదానికి సంబంధించినది. ఈ హయగ్రీవోపనిషత్తు గ్రంథపరంగా చూస్తే చిన్నది అయినా అత్యంత ఫలప్రదమైనది. సమస్తపాపాలనూ పోగొట్టి బ్రహ్మవిద్యను పొంది తద్వారా సకలైశ్వర్యాలనూ పొందింపజేసే ఉపాయం ఏమిటి ? అని నారదుడు బ్రహ్మను కోరగా బ్రహ్మ ఈ హయగ్రీవోపనిషత్తును నారదమహర్షికి ఉపదేశించాడు. హయగ్రీవదేవతాక మంత్రాలను ఎవరు తెలుసుకుని వాటిని జపించి హోమాదుల నాచరిస్తారో వారు శ్రుతి స్మృతీతిహాస పురాణాలను తెలుసుకోగలుగుతారని చెబుతుంది హయగ్రీవోపనిషత్తు. ఇందులో ముందు కొన్ని శ్లోకాలు, తరువాత ఋషి, ఛందస్సు, దేవతలతో కూడిన ఆరేడు బీజాక్షరమంత్రాల తరువాత అధర్వణవేదంలోని ఐదుమంత్రాలు ఉంటాయి.

**హయగ్రీవస్వామి పరిచయం**

**"అజాయమానో బహూధా విజాయతే" "సర్వాణి రూపాణి విజిత్యధీరః"** మొదలైనటువంటి వేదవాక్యాలు భగవంతుడు అవతారవిశేషాలను ఉనికినీ వర్ణిస్తున్నాయి. పుట్టుక లేనివాడైనా భగవంతుడు లోకాన్ని కాపాడడం కోసమై అవసరమైనప్పుడు అవసరమైన రూపాన్ని ధరించి అవనిలో అవతరించి ఆశ్రయించిన భక్తాళిని ఆదుకుంటాడు. అలా శ్రీమన్నారాయణుడి అవతారాలు అనేకం ఉన్నాయి. వాటిలో హయగ్రీవావతారం ఒకటి. హయగ్రీవ గాయత్రీమంత్రంలో తన్నో హంసః ప్రచోదయాత్ అని ఆ హంస మమ్ము జ్ఞానం వైపు ప్రేరేపించమని కోరే ప్రార్థన కనపడుతుంది. మంత్రంలోని "హంస" శబ్దానికి హయగ్రీవుడని అర్థం. హయగ్రీవుడికి గల నామాలలో ఇది కూడా ఒకటి. పూర్వం చతుర్ముఖబ్రహ్మకు వేదాలను

ఉపదేశించింది హయగ్రీవుడే అని ప్రమాణవాక్యాలు తెలుపుతున్నాయి. అలాగే యాజ్ఞ్యవల్క్యమహర్షి సూర్యుని వద్దనుండి శుక్లయజుర్వేదాన్ని ఉపదేశం పొందినట్లు చరిత్ర. హయగ్రీవుడే ఇక్కడ చెప్పబడిన సూర్యశబ్దం చేత చెప్పబడుతున్నాడని వ్యాఖ్యానాలు చెబుతున్నాయి. పురాణాలలో, వేదాలలో, ఆగమాలలో, కావ్యాలలోనూ హయగ్రీవస్వామి ప్రస్తావన ప్రసిద్ధంగా ఉంది. తేనాశ్వశిరసా గత్వా వేదానాదాయ శాశ్వతాన్ ప్రయయో భవనం దివ్యం మహర్షిగణపూజితమ్. సోఽప్యసౌ ప్రదదౌ వేదాన్ భూయ ఏవ జగద్గురుః ప్రోక్తాని పంచరాత్రాణి కల్పే కల్పే మయా పురా అనే హయశీర్షసంహిత అనే పాంచరాత్రాగమ సంహితాగ్రంథం హయగ్రీవుని గురించి సవిస్తరంగా తెలుపుతుంది. ప్రతికల్పంలోనూ తాను అవతరించి పంచరాత్ర ఆగమాలను ఉపదేశించినట్లు తనే చెప్పినట్లు ఈ శ్లోకాలు తెలుపుతున్నాయి. ఋగ్వేదంలోని వాగాంభృణో సూక్తం హయగ్రీవస్వామి గురించి చాలా అందంగా వర్ణిస్తుంది. హయగ్రీవస్వామియే సర్వదేవతా స్వరూపుడంటుంది. అహం రుద్రాభిర్వసు భిశ్చరామ్యహవాదిత్యైరుత విశ్వేదేవైః అహం మిత్రావరుణోభా బిభ్రమ్యహమింద్రాగ్నీ అహమశ్వినోభా. అనే ఆ సూక్తం లోని మంత్రం ఈ విషయాన్ని స్పష్టీకరిస్తుంది. ఈ మంత్రం వాగ్దేవి గురించి చెబుతున్నా, ఆ వాగ్దేవికి కూడా లక్ష్యభూతుడైన వాగ్దేవత హయగ్రీవుడే అందరినీ నడిపిస్తున్నాడని వ్యాఖ్యాతలు స్పష్టం చేస్తున్నారు. హయగ్రీవోపనిషత్తు ఆరంభానికి ముందు శాంతిమంత్రమైన భద్రం కర్ణేభిశ్శృణుయామ దేవాః అనే మంత్రం కూడా ఈ అర్థాన్ని ధృడపరుస్తుంది.

**హయగ్రీవోపనిషత్తు యొక్క శాంతిపాఠ తాత్పర్యము**

మిగిలిన ఉపనిషత్తులకు కూడా ఇది శాంతిపాఠంగా ఉన్నా ఇక్కడ ఉండడం వలన ఆ మంత్రం హయగ్రీవదేవతాపరంగా అర్థాన్ని ఇస్తోందని చెప్పడంలో విరోధం లేదు. ఓ దేవతలారా! మనమంతా హయగ్రీవోపాసకులమై, మన చెవులతో భద్రంగా హయగ్రీవుని ప్రతిపాదించే వేదాంతవిషయాలను విందాము. అలా ఆయన తత్త్వాన్ని

మనసులో స్థిరంగా పెట్టుకుని, హయగ్రీవవిద్యలో ప్రతిపాదించబడిన హయగ్రీవుని దివ్యమంగళవిగ్రహాన్ని కన్నులతో భద్రంగా చూద్దాము. నేరుగా చర్మ చక్షువులతో ఆ స్వామివిగ్రహాన్ని చూడగలిగిన తపస్సు ఆయుష్షు మానవులకు లేకపోయినా, మనోనేత్రాలతో భావవైశిష్ట్యంతో ఓంకారము మరియు గాయత్ర్యాదులతోనూ అంగమంత్రాలతోనూ కూడిన చతుర్భుజుడు, అష్టభుజుడు అయిన హయగ్రీవమూర్తిని దర్శిద్దాము. అటువంటి దర్శనయోగ్యత ఏమిటి అంటే స్థిరమైన శరీరావయవాలు, ఎటువంటి అనారోగ్యాలూ లేని సుస్థిరమైన శరీరాన్ని, ఆయుష్షునూ పొందుదుము గాక. పరమైశ్వర్యానికి సంకేతమూ, విశ్వరక్షకుడు, మందబుద్ధులకు కూడా జ్ఞానాన్ని ప్రస్తాదిస్తాడనే గొప్పకీర్తిని గలవాడూ, జ్ఞానం లేనిదే జీవనం సాగదుగనుక జీవనానికి అవసరమైన జ్ఞానాన్నిచ్చి అందరినీ పోషించేవాడూ మనకు కలిగే అరిష్టాలను తొలగించేవాడు, తన విషయంతో యదార్థమైన, విశుద్ధ విజ్ఞానాన్ని ఆ హయగ్రీవుడు కలుగజేయుగాక అనే ప్రార్థన తెలుస్తుంది. ఈ మంత్రంలో ఇన్ద్ర, పూష, తార్క్ష్య, బృహస్పతి శబ్దాలవలన ఆ పేర్లతో ఉండే దేవతలు సాధారణంగా తెలుస్తున్నా. ఇక్కడ ఈ ఉపనిషత్తులో భాగంగా ఉన్నందుచేత ఆయా శబ్దాలు ఏ అర్థాలను తెలుపుతున్నాయో ఆ అర్థాలన్నీ హయగ్రీవునిలో అన్వయిస్తున్నాయి. కనుక ఆయా శబ్దాలతో పిలువబడే ఇంద్రాది దేవతలకు వారివారి విశిష్టయోగ్యతలను వారికి ప్రసాదించింది దేవాధిదేవుడైన విష్ణువే అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. కనుక ఆ విష్ణువే ఈ హయగ్రీవుడు. కనుక ఈ మంత్రార్థాన్ని హయగ్రీవుడి విషయంతో అన్వయించి ఆయనను ప్రార్థించడం సముచితం.

## హయగ్రీవోపనిషత్తులోని మంత్రసారము

నారదమహర్షికి ఈ ఉపనిషత్తును ఉపదేశించిన బ్రహ్మదేవుడు ఒకనాడు తానే చేసిన బ్రహ్మయజ్ఞంలో ఆవిర్భవించిన హయగ్రీవస్వామికి నారదుని ద్వారా లోకానికి అందించాడు. వీటిని ప్రతి ఏకాదశినాడు శుచిగా జపించినవారికి సకలవిధ

సౌభాగ్యాలూ కలుగుతాయని ఈ మంత్రములు చెబుతున్నాయి. మొదటి మంత్రంయొక్క భావం ఇలా ఉంది. విశ్వవిలక్షణమైన స్వరూపాన్ని కలవాడవు, జ్ఞానానందరూపుడవు, సకలవిద్యలకు ప్రభువు అయిన హయగ్రీవస్వామీ నీకు నమస్కారం.

### రెండోమంత్రార్థం

ఋక్, యజుస్, సామాలనే మూడు వేదాలను రూపంగా కలవాడు, వేదాలను వెతికి తెచ్చినవాడు, ఓంకారస్వరూపుడు, గొప్పదైన అశ్వంయొక్క శిరస్సు కలవాడయిన హయగ్రీవునకు నమస్కారం.

మూడోమంత్ర తాత్పర్యం – సర్వ వాక్కుల అధిదేవత, సకల వేదశాఖలచేత తెలియబడేవాడు, భావించడానికి సాధ్యం కాని ఓ హయగ్రీవా! నాకు సమస్తవిద్యలను ఉపదేశించు అని ఈ మూడు మంత్రముల సారం. ఇక మిగిలిన మూడు మంత్రాలు అనేక బీజాక్షరాలలోనూ ఏకాక్షర, సప్తాక్షర ద్వాదశక్షర, త్ర్యక్షర, పంచాక్షరాలతోనూ తెలుస్తున్నాయి. వీటికి చివర మహ్యం మేధా ప్రజ్ఞాం ప్రయచ్ఛ స్వాహా అని ప్రార్థన ఉంటుంది. ఈ మంత్రాలలో అర్థం పై సాధారణంగానే అనిపిస్తున్నా, వీటిలో ఉపనిషత్తులలో ప్రసిద్ధమైన మహావాక్యాలుగా పిలువబడే ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ మొదలైన మహామంత్రాలు తెలిపే అర్థాలు రహస్యంగా ఉన్నాయని ఈ ఉపనిషత్తే చెబుతోంది.

### ఉపసంహారం

హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవేతి యో వదేత్ తస్య నిస్సంతే వాణీ జహ్ను కన్యా ప్రవాహవత్ అని హయగ్రీవస్తుతి. హయగ్రీవ అని నామోచ్చారణ చేయడం చేతనే గంగాప్రవాహం లాంటి వాక్ప్రవాహం వశం అవుతుందని తెలిపే ఈ శ్లోకంలో ప్రతిపాదింపబడే హయగ్రీవుని గురించి, ఆయన కృపను పొందే మార్గం గురించి సాక్షాత్తు చతుర్ముఖబ్రహ్మగారిచే తెలుపబడిన ఈ ఉపనిషత్తును పిదపకాలంలో శివుడు,

సంకర్షణుడు, నారదుడు, వ్యాసుడు మొదలైనవారంతా జపించారు. వారి నుండి మనదాకా వచ్చింది. అంతటి మహాపురుషులంతా అనుసంధించి ఈ ఉపనిషత్తుని అనుసంధించినా, వారంతా మహాపురుషులౌతారని ఉపనిషత్తు చివరి వాక్యం ద్వారా తెలుస్తున్నది.

స్వస్తి

# హయగ్రీవోపనిషత్

**శ్లో.** స్వజ్ఞోఽపి యత్ప్రసాదేన జ్ఞానం తత్ఫలమాప్నుయాత్ ।
సోఽయం హయాస్యో భగవాన్హృది మే భాతు సర్వదా ॥

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంసస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**అథ హయగ్రీవోపనిషత్ ప్రారంభః**

**హరిః ఓం**

నారదో బ్రహ్మాణముపసమేత్యోవాచాధీహి భగవన్ బ్రహ్మవిద్యాం
వరిష్ఠాం యయా చిరాత్సర్వపాపం వ్యపోహ్య బ్రహ్మవిద్యాం
లబ్ధ్వైశ్వర్యవాన్భవతి । బ్రహ్మోవాచ హయగ్రీవదైవత్యాన్మంత్రాన్యో
వేద స శ్రుతిస్మృతీతిహాసపురాణాని వేద । స సర్వైశ్వర్యవాన్భవతి ।
త ఏతే మంత్రాః । విశ్వోత్తీర్ణస్వరూపాయ చిన్మయానందరూపిణే ।
తుభ్యం నమో హయగ్రీవ విద్యారాజాయ స్వాహా స్వాహా నమః ॥ ॥ 1 ॥

ఋగ్యజుస్సామరూపాయ వేదాహరణకర్మణే ।
ప్రణవోద్గీథవపుషే మహాశ్వశిరసే నమ స్స్వాహా స్వాహా నమః ॥ ॥ 2 ॥

ఉద్గీథ ప్రణవోద్గీథ సర్వవాగీశ్వరేశ్వర ।
సర్వవేదమయాచింత్య సర్వం బోధయ బోధయ స్వాహా స్వాహా నమః ॥ ॥ 3 ॥

బ్రహ్మాత్రిరవిసవితృభార్గవా ఋషయః । గాయత్రీత్రిష్టుబనుష్టుప్ ఛందాంసి ।
శ్రీమాన్ హయగ్రీవః పరమాత్మా దేవతేతి । హ్లౌ(హ్సౌ)మితి బీజమ్ ।
సోఽహమితి శక్తిః । హ్లూ(హ్సౌ)మితి కీలకమ్ । భోగమోక్షయోర్వినియోగః ।
అకారోకారమకారైరంగన్యాసః । ధ్యానమ్ ।
శంఖచక్రమహాముద్రాపుస్తకాఢ్యం చతుర్భుజమ్ ।
సంపూర్ణచంద్రసంకాశం హయగ్రీవముపాస్మహే । ।
ఓం శ్రీమితి ద్వే అక్షరే । హ్లౌ(హ్ సౌ)మిత్యేకాక్షరం । ఓం నమో
భగవత ఇతి సప్తాక్షరాణి । హయగ్రీవాయేతి పంచాక్షరాణి ।
విష్ణవ ఇతి త్ర్యక్షరాణి । మహ్యం మేధాం ప్రజ్ఞామితి
షడక్షరాణి , ప్రయచ్ఛ స్వాహేతి పంచాక్షరాణి ।
హయగ్రీవస్య తురీయో భవతి ॥ ॥ 4 ॥

ఓం శ్రీమితి ద్వే అక్షరే । హ్లౌ(హ్సౌ)మిత్యేకాక్షరమ్ । ఐమైమైమితి
త్రీణ్యక్షరాణి । క్లీం క్లీమితి ద్వే అక్షరే । సౌః సౌరితి ద్వే అక్షరే ।
హ్రీమిత్యేకాక్షరమ్ । ఓం నమో భగవత ఇతి సప్తాక్షరాణి ।
మహ్యం మేధాం ప్రజ్ఞామితి షడక్షరాణి । ప్రయచ్ఛ
స్వాహేతి పంచాక్షరాణి । పంచమో మనుర్భవతి ॥ ॥ 5 ॥

## ఇతి హయగ్రీవోపనిషత్సు ప్రథమోపనిషత్

హయగ్రీవైకాక్షరేణ బ్రహ్మవిద్యాం ప్రవక్ష్యామి । బ్రహ్మా
మహేశ్వరాయ, మహేశ్వర స్సంకర్షణాయ, సంకర్షణో నారదాయ,
నారదో వ్యాసాయ, వ్యాసో లోకేభ్యః ప్రాయచ్ఛదితి
హకారోంసకారోమకారోం త్రయమేకస్వరూపం భవతి । హ్లౌం(హ్సౌం)
బీజాక్షరం భవతి । బీజాక్షరేణ హ్లౌం(హ్సౌం) రూపేణ తజ్జాపకానాం

సంపత్సారస్వతౌ భవతః । తత్స్వరూపజ్ఞానాం వైదేహీ ముక్తిశ్చ భవతి ।
దిక్పాలానాం రాజ్ఞాం నాగానాం కిన్నరాణామధిపతిర్భవతి ।
హయగ్రీవైకాక్షరజపశీలాజ్ఞయా సూర్యాదయః స్వతః స్వస్వకర్మణి
ప్రవర్తంతే । సర్వేషాం బీజానాం హయగ్రీవైకాక్షరబీజమనుత్తమం
మంత్రరాజాత్మకం భవతి । హ్లౌం(హ్స్రౌం) హయగ్రీవస్వరూపో భవతి ।
అమృతం కురు కురు స్వాహా । తజ్జాపకానాం వాక్సిద్ధిః
శ్రీసిద్ధిరష్టాంగయోగసిద్ధిశ్చ భవతి । హ్లౌం(హ్స్రౌం) సకలసామ్రాజ్యేన
సిద్ధిం కురు కురు స్వాహా । తానేతాన్మంత్రాన్యో వేద అపవిత్రః
పవిత్రో భవతి । అబ్రహ్మచారీ సుబ్రహ్మచారీ భవతి ।
అగమ్యాగమనాత్పూతో భవతి । పతితసంభాషణాత్పూతో
భవతి । బ్రహ్మహత్యాదిపాతకైర్ముక్తో భవతి । గృహం గృహపతిరివ
దేహీ దేహాంతే పరమాత్మానం ప్రవిశతి । ప్రజ్ఞానమానందం బ్రహ్మ
తత్త్వమసి అయమాత్మా బ్రహ్మ అహం బ్రహ్మాస్మీతి మహావాక్యైః
ప్రతిపాదితమర్థం త ఏతే మంత్రాః ప్రతిపాదయంతి । స్వరవ్యంజనభేదేన
ద్విధా ఏతే । అథానుమంత్రాన్ జపతి । యద్వాగ్వదంత్యవిచేతనాని
రాష్ట్రీ దేవానాం నిషసాద మంద్రా । చతస్ర ఊర్జం దుదుహే పయాంసి
క్వ స్విదస్యాః పరమం జగామ ॥ ॥ 1 ॥

గౌరీర్మిమాయ సలిలాని తక్షత్యేకపదీ ద్విపదీ సా చతుష్పదీ ।
అష్టాపదీ నవపదీ బభూవుషీ సహస్రాక్షరా పరమే వ్యోమన్ ॥ ॥ 2 ॥

ఓష్ఠాపిధానా నకులీ దంతైః పరివృతా పవిః ।
సర్వస్యై వాచ ఈశానా చారు మామిహ వాదయేతి చ వాగసః ॥ ॥ 3 ॥

ససర్పరీరమతిం బాధమాన బృహన్మిమాయ జమదగ్నిదత్త ।
ఆసూర్యస్య దురితా తనాన శ్రవో దేవేష్వమృతమజుర్యం ॥ ॥ 4 ॥

య ఇమాం బ్రహ్మవిద్యామేకాదశ్యాం పఠేద్ధయగ్రీవప్రభావేన మహాపురుషో భవతి । స జీవన్ముక్తో భవతి । ఓం నమో బ్రహ్మణే ధారణం మే అస్త్వనిరాకరణం ధారయితా భూయాసం కర్ణయోః శ్రుతం మాచ్యోఢ్వం మమాముష్య ఓమిత్యుపనిషత్ ॥

ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగైస్తుష్టువాంసస్తనూభిర్వ్యశేమ దేవహితం యదాయుః ।
స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి హయగ్రీవోపనిషత్సమాప్తః**